

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం,15 అక్టోబర్ 2025

8 పేజీలు


# గరుడుడు..ఘనుడై





- కమనీయంగా గరుడ వాహన సేవ
- పోటెత్తిన భక్తజనం
- స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే బండారు దంపతులు






**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** చందన స్వరూపుడు వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి 13వవార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఐదవ రోజు మంగళవారం స్వామివారు గరుడ వాహనంపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయ ప్రదానం చేశారు.వాహన సేవ రాత్రి 8 గంటల నుండి అర్ధరాత్రి వరకుకొనసాగింది. స్వామివారు తిరువా భరణాలు ధరించి దేదీప్యమానంగా వెలుగొందారు. భక్తుల గోవింద నామస్మరణ మధ్యసేవ అత్యంత రమణీయంగా జరిగింది.వివిధ కళా బృందాలు స్వామివారికి నీరాజనం పలికాయి.ఈకార్యక్రమాలను తిలకించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక,తమిళనాడు,ఒడిస్సా ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఆలయపరిసరాలన్నీ కిక్కిరిసాయి. పండితులు ఖండవల్లి రాజేశ్వర ప్రసాద్ ఆచార్యుల ఆధ్వర్యంలో ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనము, సప్త కళశారాధన, మహాస్నపనము, వసంతోత్సవము, అష్టదళ పాదపద్మారాధన,

- తరువాయి 2లో..

### ఇసుక లభ్యతపై ప్రజల అభిప్రాయాలపై

# నివేదిక ఇవ్వాలి

- జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆదేశాలు
- కలెక్టర్ కీర్తి చేకూరి




**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** ఇసుక ఆపరేషన్లలో పారదర్శకత, చట్టబద్ధత తప్పనిసరి అని,ప్రజల సంతృప్తి కోసం అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని జిల్లాకలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్‌తో కలిసి జిల్లాకలెక్టర్ కీర్తిచేకూరి అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తిచేకూరి మాట్లాడుతూ జిల్లాలో ఇసుక లభ్యతకు ఎటువంటి ఇబ్బందులు లేవని, నిర్మాణ పనుల కోసం అవసరమైన ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద సమృద్ధిగా అందుబాటులో ఉందని తెలిపారు. జిల్లా పరిధిలో 29 స్టాక్ పాయింట్లలో మొత్తం 9,96,736 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉండగా, ఇప్పటివరకు 5,20,397 మెట్రిక్ టన్నులు వినియోగమయ్యాయి. ప్రస్తుతం 4,76,339 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని వివరించారు. ఇతర జిల్లాలకు కేటాయించిన 8స్టాక్ పాయింట్లలో 3,92,434మెట్రిక్ టన్నులలో49,914 ఎమ్.టి. వినియోగమై, ఇంకా 3,42,520మెట్రిక్ టన్నులు

- తరువాయి 2లో..

## గూగుల్ డేటా సెంటర్ రాకతో రాష్ట్ర సర్వతోముకాభివృద్ధి

- శాసనసభ్యులు వనమాడి కొండబాబు



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** గూగుల్‌డేటా సెంటర్ రాకతో యంగెస్ట్ స్టేట్‌గా ఉన్న ఆంధ్రప్రదేశ్ హైయెస్ట్ ఇన్వెస్ట్మెంట్ స్టేట్‌గా మారుతుందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. ఈసందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఆలోచనతో రాష్ట్రానికి

- తరువాయి 2లో..

## కల్తీ బ్రాండ్లను మార్కెట్‌లోకి తెచ్చిందే జగన్ మోహన్ రెడ్డి

- మంత్రి కందుల దుర్గేష్

**నిడదవోలు,మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో మద్యం విధానం విషయంలో అత్యంత పారదర్శకంగా తాము పనిచేస్తుంటే వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి తమ నాయకులతో కలిసి బురదజల్లడమే పనిగా పెట్టుకున్నాడని మంత్రి కందుల దుర్గేష్ సోమవారం ఒక ప్రకటనలోతెలిపారు. వైఎస్సార్సీపీ పిలుపుమేరకు నకిలీ మద్యంపై నిడదవోలులో వినతిపత్రాలు ఇచ్చిన వైసీపీ నేత, మాజీఎమ్మెల్యే జి.శ్రీనివాసులు నాయుడుపై మంత్రి కందుల దుర్గేష్ మండిపడ్డారు. నకిలీ మద్యాన్ని అరికట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలంటూ వైసీపీ నేతలు మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించడమే అన్నారు. మద్యపాన నిషేధం విధిస్తామని చెప్పి నాడు అధికారంలోకి వచ్చి చివరికి ప్రభుత్వమే లిక్కర్ అమ్మే పరిస్థితికి దిగజార్చిన వ్యక్తి జగన్ మోహన్ రెడ్డి కాదా అని మంత్రి దుర్గేష్ మండిపడ్డారు.నాడు ప్రభుత్వమే మద్యం అమ్మడం ఒకెత్తైతే సొంతబ్రాండ్లు, మద్యం వేలం పాటలు, తయారీ, అమ్మకాలు కూడా ప్రభుత్వం చేయడమేంటి ..ప్రభుత్వ వ్యవస్థను దిగజార్చిన జగన్ మోహన్ రెడ్డి నకిలీ మద్యానికి చిరునామా అన్నారు. గత ప్రభుత్వంలో కల్తీ మద్యం వల్ల పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయినప్పుడు వైసీపీ నేతలు నోరెందుకు మెదపలేదని మంత్రి కందుల

- తరువాయి 2లో..



## సీఎం సహాయనిధి పేదలకు ఎంతో ఆర్థిక భరోసా

- ఎమ్మెల్యేచే రూ.11,00,871లు చెక్కుల పంపిణీ

**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** అనారోగ్యాలపాలై ఆర్థికంగా నష్టపోయిన అభాగ్యులకు ముఖ్యమంత్రి సహాయనిధి చక్కని ఆర్థిక భరోసా కల్పిస్తుందని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాలశిరీషదేవి అన్నారు. మంగళ వారం రంపచోడవరంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకునే క్రమంలో కుల,మత,పార్టీలు




చూడకుండా సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు.ఎలాంటి

- తరువాయి 2లో..

## పాడి పరిశ్రమ పోషకలు ప్రాథమిక సహకార సంఘాల ద్వారా అందించేందుకు చర్యలు

- జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్

**అమలాపురం,మేజర్‌న్యూస్ :**పాడిపరిశ్రమ అభివృద్ధికి పోషక విలువలు కలిగిన ప్రోటీన్ టోటల్ మిక్సర్ రేషన్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా అందించేందుకు చర్యలు చేపడుతు న్నట్లు జిల్లాకలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వెల్లడిం చారు. మంగళవారంస్థాని కలెక్టరేట్ నందు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు జిల్లా సహకారశాఖ సిబ్బందితో సంయుక్తంగా సమావేశం నిర్వహించి పాల దిగుబడిని పెంచే దిశగా మిక్స్ దానా సరఫరాకై




కార్యాచరణపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనసీమ జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధికై ప్రాథమిక వ్యవసాయ

- తరువాయి 2లో..

# గరుడుడు..ఘనుడై

మొదటిపేజి తరువాయి

ప్రధానహోమములు, దిగ్దేవతాబలి హరణ,నీరాజన మంత్ర పుష్పములు, తీర్థ ప్రసాద వితరణ,సాయంత్రం స్వస్తి వచనము, ప్రధాన హోమములు,హనుమత్ మూలమంత్ర హవనము,దిగ్దేవతా బలి హరణ, అష్టోత్తరశతకళశారాధన, పంచశయ్యాధివాసము,ఏకాంత సేవ,నీరాజన మంత్రపుష్పములు,తీర్థ ప్రసాదవితరణ, రాత్రి మళయప్ప అలంకరణలో గరుడ వాహన సేవ తదితర కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు.స్వామివారికి ఎమ్మెల్యేబండారు సత్యానంద రావు, కమలారాణి దంపతులు;నియోజకవర్గజనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ దంపతులు; చైర్మన్ ముదునూరి వెంకటరాజు, సత్య శ్రావణి దంపతులు; డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు, కనకదుర్గాదేవి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాడపల్లి రాష్ట్రస్థాయిలో ఖ్యాతి గడించినందున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుఆలయఅభివృద్ధిపై ప్రత్యేకదృష్టి సారించారన్నారు.ఇటీవల అమరావతిలో జరిగిన ఒక సమావేశంలో ఈఅంశాన్ని ప్రస్తావించారన్నారు.వసతిగదులు, డార్మెటరీలు, కంపార్ట్మెంట్ సౌకర్యాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మాడవీధుల్లో ప్రదర్శనలు సునాయాసంగా చేసేందుకు రోడ్డువిస్తరణ చేయనున్నట్లుచెప్పారు. తిరుమల వెళ్ళి బ్రహ్మోత్సవాలను దర్శించుకోలేని భక్తులందరూ వాడపల్లి వచ్చి బ్రహ్మోత్సవాలను దర్శించుకునేలా, తిరుమలను తలపించేవిధంగా వాడపల్లిలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయని,కొత్తపేట నియోజకవర్గ ప్రజలు, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు, ప్రధాని మోదీ,ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషికి స్వామివారి అనుగ్రహం కూడా తోడు అవ్వాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. తిరుమల తర్వాత మరోతిరుమలగా వాడపల్లిక్షేత్రం వెలుగులీననుందని, స్వామివారి వైభవం ప్రపంచమంతా చాటేలా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.శానిటేషన్,టాయిలెట్ సౌకర్యాలతో భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవడం జరిగింద న్నారు. శాసనసభ్యునిగా తాను, నూతన చైర్మన్ ముదునూరి వెంకట రాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్ రావు మాస్టర్ ప్లాన్ అమలుకు తీవ్రంగా కృషిచేస్తున్నామని తెలిపారు. ఒకప్పుడు శనివారం వచ్చిందంటే ఏ విధంగా రద్దీని తట్టుకోవాలా? అనే పరిస్థితి ఉండేదని, నేడు మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా రహదారుల అభివృద్ధి, 90 టాయిలెట్ల నిర్మాణం,పార్కింగ్ ఏరియా లెవెలింగ్ మొదలైన పనులు పూర్తి చేశామన్నారు. వకుళమాత అన్నదాన కేంద్రం మరికొన్ని రోజుల్లోనే నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. మరో 8 ఎకరాలు పార్కింగ్ ఏరియా కోసం ఫిల్లింగ్ చేయనున్నట్లు, 54 రూములు, 4 డార్మెటరీలతో మరో పెద్ద భవనం నిర్మించబోతున్నట్లు తెలిపారు. జాతీయ రహదారి నుంచి అటు రాజమహేంద్రవరం నుంచి గాని ఇటు రావులపాలెం నుంచి గాని అన్నివైపులా వాడపల్లికి వచ్చేలా రహదారుల అభివృద్ధి చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.నియోజకవర్గంలోని 57 గ్రామాల నుంచి వాడపల్లికి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉచిత బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందరూ తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. నేడు సుప్రభాత సేవ, అష్టోత్తర శత కలశాభిషేకం, లక్ష తులసి పూజ, శ్రీకృష్ణ అలంకరణతో సూర్యప్రభ వాహన సేవ, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర మూలమంత్ర పూర్వక వెంకటేశ్వర హోమం, మోహిని అలంకరణతో చంద్రప్రభ వాహన సేవ తదితర కార్యక్రమాలు జరగనున్నాయి.

# సీఎం సహాయనిధి పేదలకు ఎంతో ఆర్థిక భరోసా

మొదటిపేజి తరువాయి

వ్యత్యాసం చూపకుండా అందరికీ న్యాయం చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే వారుచాలాఆర్థికంగా నష్టపోయి ఉన్నారని, అలాంటి వారికి కాస్తంత సాయంఅందిచటంలోవారికిభరోసా కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా రంపచోడవరం నియోజకవర్గం వ్యాప్తంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన వారికి చెక్కులు పంపిణీ చేశారు.వారిలో బవరాజు వరలక్ష్మికు రూ.30,028లు, దొంతు రామ చంద్రరావుకు రూ.50,000లు,ముత్యాల శేషగిరికి రూ.30,000లు, కాకర్లపూడి సీతారామ కృష్ణంరాజుకు రూ.48,824లు, గుర్రం సాయికు రూ.65,141లు, మిరియాల నానిబాబు కు రూ.1,88,604లు, సిరిగం గీతా కళ్యాణి కు రూ.19,900లు, కొరారి వీర వెంకటరమణకు రూ.45,000లు, జాటోత్ సురేష్ కు రూ.55,787లు, మాకారపు బాబ్జికి రూ.85,000లు, బొల్లా నరసింహారావుకు రూ.52,284లు, జర్తా సీమయమ్మకు రూ.18,905లు, ఈడిబిల్లిసత్తిబాబుకు రూ.1,35,604 లు,కట్టా త్రిమూర్తులుకురూ.42,000లు,తుర్రంరోహిణికు రూ.32,100 లు, సాదేఇందుసాయినందినికి రూ.80,000లు, పోతునూరి పుల్లయ్యకు రూ.32,046లు,బద్రిరాజు వల్లీరామసీతదేవికు రూ.28,800లు, ఎండీ సదియా శబ్నంకు రూ.25,820లు, సింగిరెడ్డి లక్ష్మికు రూ.35,028లు చెక్కులు అందజేశారు. లబ్ధిదారులకు అనారోగ్య కారణాల చేత అత్యవసరంగా జరిగిన వైద్య ఖర్చులు నిమిత్తం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంక్షేమ నిధి నుండి వచ్చిన సి ఎం ఆర్ ఎఫ్ చెక్కులు అందజేసినట్లు తెలిపారు. అలాగే గతవైసీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. సకాలంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్వోసీలు అందించకుండా పేదల ప్రాణాలతో చెలగాటం ఆడిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఓవైపు ప్రభుత్వ వైద్య వ్యవస్థను బలోపేతం చేస్తూ, వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేద కుటుంబాలకు వైద్యఖర్చులు భారం కాకుండా సకాలంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్వోసీలు అందజేస్తూ వారి ఆరోగ్యానికి బాసటగా నిలుస్తోందన్నారు.ఈకార్యక్రమంలో రంప చోడవరం మండలం పార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంతమోహన్, సీతపల్లి దేవస్థానం చైర్మన్ కుంజం బాపన్న దొర, ప్రధాన కార్యదర్శి కోసు నాగన్న దొర,అరకు పార్లమెంట్ టి.ఎన్.ఎస్.ఎఫ్.కార్యదర్శి, జనసేన మండలం పార్టీ అధ్యక్షులు మళ్ళ దుర్గా ప్రసాద్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కర్రి సన్యాసిరెడ్డి, యూనిట్ ఇంచార్జి పాము రాంబాబు, కొరగని ప్రశాంత్ రాజు, చింతూరు మాజీ మండలం పార్టీ అధ్యక్షులు ఇల్లా చిన్నారెడ్డి, సీనియర్ నాయకులు సయ్యద్ ఆశీఫ్, కూనవరం మాజీ మండలం పార్టీ అధ్యక్షులు ఎడవల్లి భాస్కర రావు, ప్రధాన కార్యదర్శి మాజీ ఎంపీపీ పొడియం అప్పారావు, సోమక సత్యనారాయణ, చెల్లిక ఉమా మహేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు తోటకూరి వెంకటేశ్వరరావు, కొంగల కన్నారావు, విఆర్ పురం సొసైటీ అధ్యక్షులు గొంది చంద్రయ్య, ఎంపీటీసీ వి.వెంకటేశ్వరరెడ్డి, పాయం రామారావు, రాష్ట్ర ఎస్టీ విభాగం కార్యదర్శి చవలం రాజు, ముత్యాల రమేష్, సిద్దార్థ పాల్గొన్నారు.

# పాడి పరిశ్రమ పోషకలు ప్రాథమిక సహకార సంఘాల ద్వారా అందించేందుకు చర్యలు

మొదటిపేజి తరువాయి

సహకార పరపతి సంఘాల ద్వారా మిశ్రమ దానాను లాభాపేక్ష లేకుండా రైతులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముందుగా సంఘాల పరిధిలో గేదెల యూనిట్లను గుర్తించి ఆ ప్రకారం ముందుగా కంపెనీల ద్వారా ఎంపిక చేసిన టెండర్లకు అనుగుణంగా దానాలు ఆయా సహకార సంఘాలకు సరఫరా చేసేలాచర్యలు తీసుకోవడం జరుగుతుంద న్నారు.అక్కడినుంచి పాడిరైతులు కొనుగోలు చేసుకుని తమ పశువులకు పోషక విలువలు కలిగిన దానాను అందించి అధిక పాల దిగుబడిని పొందేలా కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ యాంత్రీకరణ వచ్చిన తర్వాత పాడిప రిశ్రమ అభివృద్ధి కుంటుప డింద న్నారు. ఈయంత్రాల కోత వల్ల ఎండు గడ్డి దొరకని పరిస్థితి ఏర్పడిపాడిరైతులు పశుగ్రాసంకోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు.అధికధరను హెచ్చించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.ఈనేపథ్యంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. జిల్లాలో పాడి రైతులకు తక్కువ ధరలకు పాడి రైతులకు దాణాను అందించే దిశగా వ్యవసాయ సహ కార సహకార పరపతి సంఘాలు (ఫ్యాక్స్) ద్వారా లాభాపేక్ష లేకుండా సరసమైన ధరకు సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. గోదావరి వరదలు, తుఫాన్ల సమయంలో పాడి రైతులు ఇబ్బందుల సమస్యలను పశు సంవర్ధకశాఖ అధికారులతో పలుమార్లు జిల్లా యంత్రాంగం దృష్టికి తేవడం జరిగింద న్నారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ తక్కువ ధరకు నాణ్యమైన పశు దాణాను ఏ విధంగా అందించగలమనే దానిపై పలు మార్లు చర్చలు జరిపారన్నారు. తాజాగా పశుదాణాను తయారు చేసే సంస్థలతో మాట్లాడి తక్కువ ధరకు నాణ్యమైన పశు దాణాను పాడిరైతులకు అందించేలా ఒప్పందం చేసుకుని తగిన ఏర్పాట్లు చేస్తున్నారన్నారు.

ఇప్పటికే రైతాంగానికి ఆర్థిక పరమైన సేవలందించే సొసైటీల ద్వారా ఎరువుల విక్రయాలు జరుగుతున్నాయని, ఆ సొసైటీల ద్వారానే పశు దాణాను కూడా పాడి రైతులకు అందుబాటులోకి తేవాలన్నదే తమ ఉద్దేశ్యం అన్నారు. దీనిపై సహకార సంఘ ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించామన్నారు. జిల్లావ్యాప్తంగా ఎరువులు అధికంగా విక్రయించే 9 సొసైటీల ద్వారా దాణాను కూడా విక్రయించాలని నిర్ణయించార న్నారు. 8లీటర్లు నుంచి 10లీటర్ల పాలిచ్చే పశువులు సమీకృత దాణా రోజుకు 2కిలోలు చొప్పున పెడితే సుమారు లీటరు నుంచి అరలీటరు వరకు పాలు పెరిగే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారి వెంకట్రావు, డిడి కే.మూర్తి, ఏడి ఉమా మహేశ్వర్ రెడ్డి, సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇసుక లభ్యతపై ప్రజల అభిప్రాయాలపై నివేదిక ఇవ్వాలి

మొదటిపేజి తరువాయి

అందుబాటులో ఉన్నాయని తెలిపారు.గోదావరినదిలో నీటి స్థాయిలను దృష్టిలో ఉంచుకొని, తదుపరిఆదేశాల వరకూ ఓపెన్‌రీచ్‌లలో డీ-సిల్టేషన్ త్రవ్వకాలకు అనుమతులుఇవ్వబడవు అనిపేర్కొన్నారు.అయితే నిర్మాణ పనుల అవసరాలకు తగినంత ఇసుక లభ్యత ఉందని స్పష్టం చేశారు. జిల్లాలోని 66రీచ్‌లలో 14ఓపెన్ రీచ్‌లు (మాన్యువల్) ద్వారా 9,60,012 ఎమ్.టి.అనుమతులు ఇవ్వబడ్డాయని,అందులో ఇంకా 1,68,850 ఎమ్.టి. అందుబాటులో ఉందన్నారు. 9ఓపెన్ సాండ్ రీచ్‌లు (సెమీ మెకనైజ్డ్)లో 53,55,540 ఎమ్.టి.లలో 39,90,893 ఎమ్.టి. ఇంకా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే పట్టా ల్యాండ్లలో డీకాస్టింగ్ రీచ్‌లు ద్వారా 3,73,671 ఎమ్.టి.లలో 1,99,115ఎమ్.టి.ఇసుక అందుబాటులో ఉందన్నారు. జిల్లాలో 31 డీ-సిల్టేషన్ పాయింట్లలో 46,19,500 ఎమ్.టి. ఇసుక కేటాయింపులు జరగగా, అందులో 17,60,709 ఎమ్.టి.ఇంకా అందుబాటులో ఉందన్నారు. అదనంగామరో 9డీ-సిల్టేషన్ రీచ్‌లకు 15,97,000 ఎమ్.టి. అనుమతులు ఇవ్వడంజరిగిందన్నారు.ప్రస్తుతం వరద నీటి స్థాయిలు తగ్గిన వెంటనే త్రవ్వకాలు తిరిగి ప్రారంభించనున్నట్లు,ఆమేరకు మార్గదర్శకాలు అనుసరించి అనుమతులు ఇవ్వడం జరుగుతుందనీ తెలిపారు. 4 లక్షల క్యూసెక్కుల కంటే తక్కువ నీటి నిల్వ ఉన్నప్పుడు మాత్రమే త్రవ్వకాలకు అనుమతి ఇవ్వబడు తుందని ఇరిగేషన్ అధికారులు వివరించారు.

## గూగుల్ డేటా సెంటర్ రాకతో రాష్ట్ర సర్వతోముకాభివృద్ధి

మొదటిపేజి తరువాయి

పెట్టుబడులను తీసుకురావడం జరుగుతుందని, సాంకేతిక రంగం రాష్ట్ర భవిష్యత్తును ఏరకంగా మారుస్తుందో హైదరాబాద్ ఉదాహరణ అని, ఆనాడు చంద్రబాబు నాయుడు హైదరాబాదును ఐటీ హబ్ గా మార్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పనకు దూర దృష్టితో మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలను హైదరాబాద్‌కు తీసుకువచ్చారని, నేడు చంద్రబాబు సారధ్యంలో విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రాకతో ఆంధ్ర రాష్ట్రం డిజిటల్ హబ్ గా మారుతుందని, నేడు గూగుల్ సంస్థ విశాఖలో 87 వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో సౌత్ ఏషియాలోనే అతిపెద్ద రెండవ డేటా క్లస్టర్‌ను ఏర్పాటు చేయబోతుందని, ఇది రాష్ట్ర అభివృద్ధిలో ఒక మైలురాయిగా మారుతుందని, సింగపూర్, అమెరికా, మలేషియా, వంటి దేశాల్లో పర్యటించి రాష్ట్రానికి పెట్టుబడులను ఉద్యోగ అవకాశాలను తీసుకురావడం జరుగుతుందని, గూగుల్ రాకతో రానున్న కాలంలో ఐటీ, టెక్, ఎఐ కంపెనీలు ఆంధ్రరాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయని, గూగుల్ లాంటి ప్రముఖ సంస్థలు రాకతో ఆంధ్ర రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు లభిస్తాయి అని, నేడు గూగుల్ సంస్థ రాకతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపతంకావడంతో పాటు వ్యవసాయం, విద్య, వైద్య రంగాలు మెరుగుపడతాయని, గత వైసిపి ప్రభుత్వం ఎటువంటి ఐటీ కంపెనీలు, పరిశ్రమలు ఆంధ్ర రాష్ట్రంలో ఏర్పాటు చేయడానికి కృషి చేయలేదని, రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తగిలిపోయే విధంగా పాలన సాగించారని పేర్కొన్నారు.

## కల్తీ బ్రాండ్లను మార్కెట్‌లోకి తెచ్చిందే జగన్ మోహన్ రెడ్డి

మొదటిపేజి తరువాయి

దుర్గేష్ ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో కల్తీ మద్యం నడిపిన ఎంత మందిపై చర్యలు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. నాడు కల్తీ మద్యానికి ఆద్యులైన వారిని జగన్ మోహన్‌రెడ్డి అందలం ఎక్కిస్తుంటే అడ్డుకోకుండా ఏం చేశారని కోప్పడ్డారు. గత ఐదేళ్ల ట్రాక్ అండ్ ట్రేస్ విధానాన్ని నాటి సీఎం జగన్ మోహన్ రెడ్డి నాశనం చేసినప్పుడు వీరంతా ఎక్కడున్నారని నిలదీశారు. గడిచిన ఐదేళ్లలో పొరుగు రాష్ట్రాల కంటే ఏపీలో మద్యం రేట్లు ఎక్కువ ఉన్న మాట వాస్తవం కాదా అని మంత్రి కందుల దుర్గేష్ ప్రశ్నించారు. వైసీపీ హయాంలో రాష్ట్ర సరిహద్దుల్లో అక్రమ మద్యం రవాణా ఏ రేంజ్ లో జరిగిందో ఆ పార్టీ నేతలకు తెలియదా అన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విచిత్రమైన బ్రాండ్లను గత ప్రభుత్వం ప్రభుత్వ షాపుల్లో అమ్మిన మాట వాస్తవమా కాదా అని ఫైర్ అయ్యారు. ప్రభుత్వ షాపుల పేరిట ప్రభుత్వఖజానాను తమ నాయకులకు దోచిపెట్టారా లేదా అని ఆగ్రహించారు. రాష్ట్రంలోని మద్యం వ్యాపారాన్ని సిండికేట్ చేసిన జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు నీతి వాక్యాలు మాట్లాడు తుండటం హాస్యాస్పదమన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం నవోదయం 2.0 ద్వారానాటుసారా పూర్తిగా నిర్మూలించామని మంత్రి కందుల దుర్గేష్ వివరించారు. దాదాపు 21 జిల్లాలను సారా రహిత జిల్లాలుగా మార్చామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే ప్రతి బాటిల్ ను 13 సార్లు పరీక్ష చేయిస్తున్నామన్నారు. అంతేగాక డిపోల నుండి మద్యం షాపులకు చేరిన తర్వాత కూడా పరీక్షిస్తున్నామని వెల్లడించారు. కల్తీ వ్యాపారంపై పూర్తి స్థాయి ట్రాకింగ్ విధానం అమలు చేస్తున్నామని, నిరంతరం నిఘా పెట్టామన్నారు. సేల్స్ ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తున్న కారణంగా నేడు కల్తీమద్యం స్కాం బయటపడిందని అన్నారు.ప్రజల ప్రాణాలకు చేటు కల్గించే కల్తీ మద్యంపై కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందన్నారు. రాజకీయ ముసుగులో తప్పుడు పనులు చేసే వారిపై కూటమి ప్రభుత్వంఉక్కు పాదం మోపుతుందన్నారు.

# నర్సాపురం మెటల్ క్వారీ బాధితులపై దాడి





**– మైనింగ్ మాఫియాపై చర్యలకు డిమాండ్**

**రంపచోడవరం, మేజర్ న్యూస్** : రంపచోడవరం మండలం నర్సాపురం మెటల్ క్వారీ బాధితులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దీనిపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను డిమాండ్ చేసారు. రంపచోడవరం మండలం నరసాపురం బ్లాక్ మెటల్ క్వారీపై క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చిన అసిస్టెంట్ డైరెక్టర్ మైన్స్ అండ్ జియాలజీ, రంపచోడవరం తాసిల్దార్ కు మెటల్ క్వారీ వల్ల నష్టపోతున్న బాధితులు తమ బాధలు, వారికి జరుగుతున్న అన్యాయంపై తెలియజేయడం జరిగింది.

అయితే ఎంక్వయిరీ జరుగుతుందన్న విషయం తెలుసుకున్న మైనింగ్ మాఫియా ముందుగానే గ్రామంలో కొంతమందికి నాటు సారా తాగించి, ఫిర్యాదు చేసిన బాధితులపై దాడులు చేయించారని ఆరోపణలు చేసారు. ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని బాధితులపై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా దాడులు చేస్తూ సెల్ ఫోన్లు లాక్కొని పగల కొట్టడం జరిగిందని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను తెలియజేశారు. అక్రమ మైనింగ్ మాఫియా వ్యవస్థకు కొమ్ముకాస్తూ ఆదివాసీ హక్కులను కొంతమంది కాలరాస్తున్న విషయం ఆదివాసులకు తెలియడం లేదని, కొందరు రెచ్చగొట్టడంతోపాటు వారు ఇచ్చే ముడుపులకు,తాగించే మద్యానికి బానిసలై గొడవలకు దిగుతున్నారన్నారు. క్వారీ వల్ల తమకు అన్యాయం జరుగుతుందని ఫిర్యాదు చేసిన రైతులపై అన్యాయంగా దాడి చేయడం ఆదివాసులు వారి చేతి వేళ్ళతో వారి కంటిని పొడుచుకోవటమేనని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. క్వారీ నిబంధనలు ప్రకారం నడుస్తున్నట్లయితే, చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరుగుతున్నట్లయితే క్వారీ బాధితులు అధికారులు చుట్టూ, ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరిగి ఫిర్యాదు చేయవలసిన అవసరం ఉండేది కాదన్నారు. గత ఐదేళ్లుగా నరసాపురం సమీపంలో బోడి కొండను చట్ట విరుద్ధంగా నిబంధనలు పాటించకుండా బినామీలు పేరుతో మెటల్ క్వారీ నిర్వహిస్తూ క్వారీ వల్ల వచ్చే నిధుల్లో వన్ పర్సెంట్ ఇప్పటివరకు గ్రామ అభివృద్ధికి కేటాయించలేదన్నారు. మరో పక్క క్వారీ వల్ల నష్టపోతున్న రైతులకు బాంబు బ్లాస్టింగ్ వల్ల ధ్వంసం కాబడిన ఇళ్లకు ఎటువంటి నష్టపరిహారం చెల్లించకుండా కనీసం బాధితుల ఆవేదన లెక్కచేయకుండా అధికారులను మేనేజ్ చేస్తూ చెలరేగిపోతున్న మైనింగ్ మాఫియాకు ఆదివాసీ సంఘం సరైన గుణపాఠం చెప్తుందని ఆయన హెచ్చరించారు. బాధితులకు జరిగిన నష్టానికి న్యాయం జరగాలని, అంతేగాని గ్రామంలో కొంతమంది మైనింగ్ మాఫియాకు కొమ్ముకాసినంత మాత్రాన అధికారులు చేసేది న్యాయం కాదని గుర్తుంచుకోవాలని ఆయన కోరారు.

దీనిపై త్వరలో గ్రీన్ ట్రిబ్యునల్ ఢిల్లీలో కేసు వేయబోతున్నట్లు ఆయన తెలియజేశారు. క్షేత్రస్థాయి విచారణకు వచ్చిన అసిస్టెంట్ డైరెక్టర్ మైన్స్ అండ్ జియాలజీ, తాసిల్దారు జనబలం కాకుండా బాధితులకు జరుగుతున్న నష్టం, సుప్రీంకోర్టు సమత జడ్జిమెంట్ కు వ్యతిరేకంగా, పీసా చట్టం నిబంధనలకు వ్యతిరేకంగా కొనసాగుతున్న మైనింగ్ పై కచ్చితమైన నివేదిక ఉన్నతాధికారులకు సమర్పించాలని ఆయన కోరారు. కొంతమంది వ్యక్తులు ద్వారా మెటల్ క్వారీ బాధితులకు ప్రాణహాని ఉందని, వారికి రక్షణ కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. మెటల్ క్వారీ బాధితులకు న్యాయం జరిగే వరకూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఊరుకునేది లేదని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. ప్రస్తుతం రంపచోడవరం డివిజన్ పర్యటనలో ఉన్న జిల్లా కలెక్టర్ నరసాపురం మెటల్ క్వారీ పై చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని కుంజ శ్రీను కోరారు.

# సెక్యూరిటీ గార్డ్స్‌కు జీవో 138 ప్రకారంగా వేతనాలు మంజూరు చేయాలి




**– కాకినాడ జిజిహెచ్‌లో పార్కింగ్ సమస్య తీర్చాలి**

**– సెక్యూరిటీ గార్డ్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి**

**కాకినాడ,మేజర్‌న్యూస్** : ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ & సెక్యూరిటీ గార్డ్స్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అనుబంధ సంఘం ఆధ్వర్యంలో కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో మంగళవారం ఉదయం మెయిన్ గేటు వద్ద అప్పారావు అధ్యక్షతన సెక్యూరిటీ గార్డ్ సమస్యల పరిష్కరించాలని, జీవో ప్రకారంగా వేతనాలు మంజూరు చేయాలని నిరసన ధర్నా జరిగింది. ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ కాంట్రాక్టర్ సెక్యూరిటీ గార్డ్స్‌కు జీవో ప్రకారంగా జీతాలు మంజూరు చేయడం లేదని, శ్రమకు తగిన వేతనం రావడం లేదని శ్రమ దోపిడీకు గురి అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నెంబర్ 138 ప్రకారంగా ఈపీఎఫ్ ఈఎస్ఐ తో కలిపి వేతనంగా రూ.18,600 మంజూరు చేయవలసి ఉండగా కేవలం రూ.12,100 మాత్రమే మంజూరు చేస్తున్నారన్నారు.అదనపు డ్యూటీల బకాయి వేతనాలు,ఈపీఎఫ్ ఈఎస్ఐతో కలిపి తక్షణమే చెల్లించాలని, సెక్యూరిటీ గార్డ్స్‌కు వారాంతపు సెలవుతోపాటు 21పండగ సెలవులు అమలు చేయాలని, సెక్యూరిటీ గార్డ్స్ ను ఆప్కాస్‌లో విలీనం చేయాలని, సెక్యూరిటీ గార్డ్స్‌కి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన అన్నారు. యూనిఫారం రెండు జతలు అందజేసి కుట్టు కూలి మంజూరు చేయాలని ఆయన అన్నారు. పిఎఫ్ ఈఎస్ఐ ఖాతాలో జమైనది ఎప్పటికప్పుడు సెక్యూరిటీ గార్డ్ కు తెలియపరిచేందుకు ఆఫీసులో కంప్యూటర్ ఆపరేటర్లను నియమించాలని, ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో నిత్యం రోజుకి 4,000 మంది పైనే వైద్య సౌకర్యం నిమిత్తం వస్తున్న పేషెంట్లకు వారి బంధువులకు పార్కింగ్ స్థలం తీవ్రత ఇబ్బందులకు గురి చేస్తుందని, ప్రజలకు అసౌకర్యాలు ఏర్పడకుండా బైక్ పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసి పార్కింగ్ సమస్య తీర్చాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎన్.అనిల్ కుమార్, ఎం.జాన్‌బాబు,కాటూరిరాజు, కే.వెంకటేష్, వి.వెంకటరమణ, షఫీఖాన్, మేరా బి.రత్నం,ఎం.వెంకటలక్ష్మి,ఎస్.వెంకటలక్ష్మి, రామలక్ష్మి, వి.దుర్గాభవాని, గీతా దుర్గాభవాని తదితర సభ్యులు పాల్గొన్నారు.

# మా సమస్యలను పరిష్కరించండి

**– ఎమ్మెల్యేకి వినతి పత్రం అందజేసిన గుండాల గ్రామస్తులు**




**ఎటపాక, మేజర్‌న్యూస్** : అల్లూరి సీతారామ రాజు జిల్లా ఎటపాక మండలం గుండాల గ్రామంలో నివసిస్తున్న ప్రజలు గోదావరి వరదల కారణంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టు నిర్మించిన నాటి నుంచి గోదావరి వరదలు తాకిడికి,పంట పొలాలు, పశువులు, ఇల్లు నీట మునిగి తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వాలు మారినా వారి తలరాతలు మారడం లేదు.

మంగళవారం గుండాల గ్రామ ప్రజలు రంపచోడవరం టీడీపీ క్యాంప్ ఆఫీస్ వద్ద ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవిని మర్యాద పూర్వకంగా కలిసి గుండాల గ్రామ ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలియజేయడం జరిగింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చెప్పట్టిన నాటి నుంచి భద్రాచలం వద్ద 45 అడుగులకు గోదావరి వరద నీరు గుండాల గ్రామం చుట్టూ నీరు చేరుతుంది అని, గుండాల గ్రామం తెలంగాణ, ఆంధ్ర సరిహద్దు ప్రాంతం కావడంతో ఎవ్వరు పట్టించుకోవడం లేదని, గోదావరి వరదల సమయంలో నిత్యావసర సరుకులకు, తినడానికి కూడా చాలా ఇబ్బంది పడే పరిస్థితి గుండాల గ్రామ ప్రజలది అని, వారి గోడును ఎమ్మెల్యే కు వివరించడం జరిగింది.అట్టి విషయంపై ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. ఎమ్మెల్యే శిరీష దేవి వెంటనే స్పందించి, ఇట్టి విషయాన్ని కూటమి ప్రభుత్వం దృష్టిలో పెడతానని, ఆర్&ఆర్ ప్యాకేజి, పునరావాసం వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది.దాంతో గుండాల గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసారు.

## పేరు మార్పు

యిందుమూలముగా తెలియజేయునది ఏమనగా పెద్దాపురం మండలం, జె.తిమ్మాపురం గ్రామానికి చెందిన పిల్లి హారిక, D/o పిల్లి గోవిందు తన కుమార్తె పేరు ఆధార్ కార్డ్ నందు పిల్లి వెంకటలక్ష్మిగా తప్పుగా నమోదు కాబడినది. తన అసలు పేరు పిల్లి హారిక అని తెలియజేయుచున్నాను.

పిల్లి హారిక, D/o పిల్లి గోవిందు.

జె.తిమ్మాపురం, పెద్దాపురం మండలం.

## CHANGE OF NAME

I, GONELA RAMESH, S/o. Gonela Lakshmana Rao, R/o. Door No. 2-51-24, 100 Buildings, Srinagar, Kakinada, Kakinada Urban, Kakinada District, Andhra Pradesh - 533 003. I have changed my son's name from GONEALA S P V S S KUMAR (Old Name) to GONELA SHANKAR SUBRAHMANYA KUMAR (New Name). This is for all Records.

సూర్య www.suryaa.com

మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678

అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే సంప్రదించండి. సెల్ : 9032209779

# కొండమొదలు గిరిజనులకు భూమికి భూమి





## -నిర్వాసితుల సమావేశంలో జిల్లా కలెక్టర్

**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** పోలవరం ప్రాజెక్టు ముంపులో దేవీపట్నం మండలం కొండమొదలు బాధితులలో అర్హులైన గిరిజనులకు భూమికి భూమి (ల్యాండ్ టు ల్యాండ్) ఏర్పాటు చేయడం జరుగుతుందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్‌కుమార్‌తెలిపారు. గంగవరం మండలం నేలదోనెలపాడు ఆర్అండ్‌ఆర్‌కాలనీలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశానికి అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్ ముఖ్య అతిథులుగా హాజరైయ్యారు. ముందుగా దేవీపట్నం మండలం కొండమొదలు పంచాయితీ పరిధిలో గ్రామాలకు ఏర్పాటుచేసిన నేలదోనెలపాడు ఒకటిలో ఆర్అండ్‌ఆర్ కాలనీలలో ముందుగా సమస్యలు తెలపమని జిల్లా కలెక్టర్ తెలపగా ఆర్అండ్‌ఆర్‌కాలనీలో వీధిలైట్లు200 కుటుంబాలకు ఏర్పాటు చేయాలని,మా కాలనీలో త్రాగునీరు సరిపోవటం లేదని పూర్తిస్థాయిలో త్రాగునీరు ఏర్పాటు చేయాలని,ప్రతిగ్రామానికి సంబంధించి ఆర్అండ్‌ఆర్ కాలనీలో సబ్ సెంటర్ స్థాయిని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని, యూపీ స్కూల్లో పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయాలని,90 మంది బాలబాలికలకు ఒకే అంగన్వాడీ కేంద్రం ఉందని, మరో అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని, పోస్ట్ ఆఫీస్ భవనం నిర్మించడం జరిగిందని, పోస్టల్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని, రాజవరం నుండి నేలదోనెలపాడు గ్రామం వరకు మెటల్ పరచడం జరిగిందని, మధ్యలో పనులు ఆపివేయడం జరిగిందని వెంటనే రోడ్డు పనులు ప్రారంభించి బీటి రోడ్డు ఏర్పాటు చేయాలని, రేషన్ కార్డు లేని వారికి రేషన్ కార్డులు ఏర్పాటు చేయాలని, నేలదోనెలపాడు ఆర్ అండ్ ఆర్ కాలనీలో 24 గృహాలు అదనంగా కట్టడం జరిగిందని అర్హులైన వారికి గృహాలు మంజూరు చేయాలని, 18 సంవత్సరాల నిండిన వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని, 2023 సంవత్సరంలో జిరాయితీ భూములకు సంబంధించిన పట్టాలు, డి పట్టాలు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి సంబంధిత అధికారులకు అందజేయడం జరిగిందని, ఈ భూములకు నష్టపరిహారం చెల్లించాలని, కొండమొదలు పంచాయితీ 12 గ్రామాలకు ప్రత్యేక పంచాయితీ కొండమొదల పేరు మీద ఏర్పాటు చేయాలని, ప్రతి 50 కుటుంబాలకు ఒక హ్యాండ్ బోర్ ఏర్పాటు చేయాలని, కత్తనపల్లి గిరిజనులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని, మా ఆర్ అండ్ ఆర్ కాలనీలో వెటర్నరీ అసిస్టెంట్ ను ఏర్పాటు చేయాలని సర్పంచ్ వేట్ల విజయ, వంజం జోగారావు, ఇల్లా రామిరెడ్డి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ముందుగా ఆరు లేక ఏడు బోర్లు జల జీవన్ మిషన్ ద్వారా ఏర్పాటు చేయడం జరుగుతుందని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించడం జరిగింది. అదేవిధంగా వేసవి కాలంలో త్రాగునీటికి ఇబ్బంది లేకుండా స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసి ఫిల్టర్ బెడ్లు ఏర్పాటుకు ప్రతిపాదన తయారు చేసి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. వీధిలైట్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేసి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. పి.హెచ్.సి.ఏర్పాటుకు సంబంధిత అధికారులతో సంప్రదించడం జరుగుతుందని ఆయన అన్నారు.ఆర్అండ్‌ఆర్ కాలనీలో పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేసే విధంగా ముందుగా స్థలమును గుర్తించాలన్నారు. రోడ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేయడం జరుగుతుందన్నారు. డి పట్టాలు, జిరాయితీ భూమి సమస్యలు పరిష్కారం కొరకు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు.ల్యాండ్ టు ల్యాండ్ ఇచ్చిన భూములలో సేంద్రియ వ్యవసాయాలు చేయాలని,అదేవిధంగా కూరగాయల పంటలు వేయాలని,అదేవిధంగా కాలనీలలో ఉన్న గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందేవిధంగాసహాయ సహకారాలు అందించడం జరుగుతుందని, అదేవిధంగాశిక్షణఇవ్వడం జరుగుతుం దన్నారు. అదేవిధంగా ఆర్అండ్‌ఆర్ కాలనీలో ఎన్ని మహిళా సంఘాలు ఉన్నది అదేవిధంగా సేంద్రియ పంటలు పండించిన కూరగాయలు రాజమండ్రిలో అమ్మే విధంగా షాపుఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా కృషిచేయడం జరుగుతుందన్నారు. రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారిస్మరణ్‌రాజ్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులకు మౌలిక సదుపాయాలు పక్కాగాఏర్పాటుకుచర్యలుచేపట్టడం జరుగుతుందన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తమదృష్టికి తీసుకురావాలన్నారు. రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం నొక్వాల్ మాట్లాడుతూ కొండమొదలు పంచాయితీ ముంపు బాధితులకు ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ ద్వారా ల్యాండ్ లాండ్‌ఏర్పాటుచేయడం జరుగుతుంద న్నారు. గత కొన్ని రోజుల నుండి ఆర్అండ్‌ఆర్ ప్యాకేజీ ద్వారా ముంపు బాధితులకు ల్యాండ్‌టుల్యాండ్ ఏర్పాటుకు ముమ్మరంగా పనులు జరుగుతున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పి.అంబేద్కర్, సతీష్,తహసిల్దార్లు సిహెచ్.శ్రీనివాసరావు,కరక సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, ఎస్.బి.వి. రెడ్డి, సర్పంచ్ వేట్ల విజయ, ఇల్లా రామిరెడ్డి, పీసా కమిటీ ఉపాధ్యక్షులు పాపారావు, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్‌సర్వే లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏలేశ్వరం మండలంలో ఉద్యానవన శాఖ రైతు శిక్షణ



**ఏలేశ్వరం,మేజర్‌న్యూస్ :** ఏలేశ్వరం మండలంలో యర్రవరం, తిరుమాలి గ్రామాలలో గ్రామ సచివాలయం వద్ద ఉద్యాన పంటలలో సమగ్ర సస్యరక్షణ అలాగే మేలైన ఎరువుల యాజమాన్య పద్ధతులు గూర్చి రైతుశిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మానుకొండ శ్రీనివాస్, ఉద్యాన పంటలలో పాటించవలసిన ఎరువుల యామాన్యం గురించి రైతులకు వివరించారు.ఉద్యాన పంటలలో సాగు చేయటం ద్వారా రైతుఅధిక ఆదాయం పొందవచ్చని వివరించారు. అరటిలో వచ్చే దుంప పుచ్చు నివారణకు సూడోమోనాస్ శిలీంధ్రాన్ని మొక్కకు 50 గ్రాములు చొప్పున వేసుకోవాలని తెలిపారు.రసాయన ఎరువుల వాడకం తగ్గించి జీవన ఎరువులు,ఫాస్పరస్ సొల్యూబులైజింగ్ బ్యాక్టీరియా అజటోబ్యాక్టర్, అజోస్పైరిల్లమ్ ఇనాక్యులంట్ వాడటం వలన పంటకు, భూమి సారానికి లాభం ఉంటుందని తెలిపారు.ఉద్యాన పంటలలో సర్పిలాకార తెల్ల దోమ నివారణకు వేప నూనె పిచికారీ చేయాలని తెలిపారు. ఆఫ్రికా నత్తల నివారణకు తయోడికార్బ్‌మందును 100 గ్రాములు,100 గ్రాముల ఆముదం నూనె, 2కేజీలు బెల్లం,తవుడు 25 కేజీలు కలిపి యరలు చిన్న ఉండలుగా తయారు చేసి పొలంలో జల్లుకోవాలని వివరించారు. గోనెసంచులు ఉప్పు నీటిలో ముంచి పొలాలలో గట్ల పై వేసుకుంటే నత్తలు పొలంలోకి రాకుండా నివారించవచ్చని తెలిపారు. ఉద్యాన అధికారి దివ్యశ్రీ మాట్లాడుతూ, కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటలలో ,కోకో అంతర పంటగా సాగు చేయటానికి హెక్టారుకు 2సంవత్సరాలకు కలిపి 30000 రూపాయల రాయితీ మొక్కలు,ఎరువుల నిమిత్తం ఉందని తెలిపారు.కోకో బీన్స్ ఎండబెట్టుకోవటానికి సోలార్ డ్రైయర్ 100 కేజీలు కెపాసిటీ ,70 కేజీలు కెపాసిటీ 40% ప్రభుత్వ రాయితీ పై ఉద్యాన శాఖ ద్వారా రైతులకు అందుబాటులో ఉందని తెలియజేశారు. బిందు తుంపర సేద్యంలో ప్రభుత్వ రాయితీలను వివరించారు.అనంతరం క్షేత్రస్థాయిలో బొప్పాయి , జామ,అరటి, కూరగాయల పంటలను పరిశీలించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో యర్రవరం గ్రామ సర్పంచ్ బీసెట్టి అప్పలరాజు,బస ప్రసాద్ గారు, మైరాల కనకరావు, కూటమి నాయకులు గ్రామఉద్యాన /వ్యవసాయ సహాయకులు మనోజ్, మణికంత, గ్రామ రైతులు పాల్గొన్నారు.తిరుమాలిలో గ్రామ సర్పంచ్ సూతి ప్రసాద్, వైస్ సర్పంచ్ తోట శివరామకృష్ణగారు కూటమి నాయకులు, పసల నాగేశ్వరరావు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# వైద్య, విద్య రంగాల ప్రైవేటీకరణ సరికాదు

## - మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి



**అనపర్తి, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం మధ్యతరగతి, పేద ప్రజలకు వైద్య, విద్య రంగాలను దూరం చేసేందుకు రెండు రంగాలను ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని, వైద్య, విద్యా రంగాలను ప్రైవేటీకరణ చేయుట సరైన పద్ధతి కాదని అనపర్తి మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. వైద్య కళాశాలలు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు కోటి సంతకాల కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య,విద్య రంగాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడినందుకు వైయస్‌ఆర్‌సీపీ సిద్ధంగా ఉందని, పేద వైద్య విద్యార్థుల ఆశయాలకు విఘాతం కలిగించే కూటమి ప్రభుత్వా ప్రయత్నం విరమించుకోవాలని అన్నారు. రాష్ట్రంలో వైద్య, విద్య రంగాలను ప్రైవేటు వలల్లోకి నెట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. పేదలకు ఉచితవిద్య,వైద్యం అందించాలని వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేశారని, పేదవారి ఆశయాలకు తూట్లు పొడిచే విధంగా కూటమి ప్రభుత్వం పరిపాలన అందిస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల ఆస్తులను ప్రైవేటుపరం చేసి వేల కోట్లు దోచుకునే యత్నం చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ గిరిజన బాలికల పాఠశాలలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం




**రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్ :** రాజవొమ్మంగి ప్రభుత్వ గిరిజన బాలికల పాఠశాలలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఐసిడిఎస్ సిడిపిఓ డి సుజాత ఆధ్వర్యంలో బాలికలకు బాల్య వివాహాలు వల్ల కలిగే అనర్ధాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్స్, బాలికల హక్కులు చట్టాలు, ఫోక్స్ చట్టం గురించి సిడిపిఓ సుజాత వివరించారు. అలానే బాలికలు ఎదిగే వయసులో చాలా జాగ్రత్తగా ఉండాలి అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ అమ్మి రాజు, అంగన్వాడి వర్కర్స్ వెంకటలక్ష్మి, కుమారి, సుందరమ్మ, వీరలక్ష్మి, నూక రత్నం, వరలక్ష్మి సత్యవతి, తదితరులు ఉన్నారు.

## పారిశుద్య పనులు పరిశీలించిన ఎంపిడిఓ, డిప్యూటీ ఎంపిడిఓలు



**పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ :** పారిశుద్య పనులు నిర్వహణలో అలసత్వం వహించరాదని పెద్దాపురం మండల ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ అన్నారు. మెరుగైన పారిశుద్య నిర్వాహణలో భాగంగా తడి-పొడిచెత్త వేరు చేయడంపై మండలంలోని వాలుతిమ్మాపురం గ్రామంలో మంగళవారం పారిశుద్య పనుల నిర్వాహణను డిప్యూటీ ఎంపిడిఓ శేఖర్‌రెడ్డితో కలసి ఎంపిడిఓ పరిశీలించారు. దీనిలో భాగంగా గ్రామంలో పలు వీధులలో పారిశుద్యపనులు, ఎస్‌డబ్లూపి షెడ్‌ను పరిశీలించి, అనంతరం ఇంటింటి చెత్త సేకరణ పనులు ఆయన పరిశీలించి, ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

గ్రామంలో డ్రైన్లు, మెయిన్‌రోడ్లులను పరిశీలించి పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇంటి స్థాయిలోనే చెత్త వర్గీకరణ చేయడం వలన గ్రామం శుభ్రంగా, ఆరోగ్యకరంగా మారుతుందని, పరిశుభ్రతలో ప్రతీ ఒక్కరి బాధ్యత అవసరమని, ఆయన తెలిపారు. అలాగే గ్రామాభివృద్ధిలో ప్రజల పాత్ర ఎంతో ముఖ్యమని, ప్రతీఒక్కరూ ముందుకు వస్తే శాశ్వత పరిశుభ్రత సాధ్యమవుతుందని తెలిపారు. దీనిలో భాగంగా గ్రామస్థులకు అవగాహన కల్పించి, పరిశుభ్రతపై చైతన్యం కల్పించారు. అనంతరం ఐవిఆర్ఎస్ కాల్స్‌పై వారు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పంచాయతీ సెక్రటరీ వెంకటేష్, పంచాయతీ సిబ్బంది, పారిశుద్య సిబ్బంది ఉన్నారు.

# సూపర్ జీఎస్టీ అమలుతో భవన నిర్మాణ ఖర్చులు తగ్గుదల





– ఒక దేశం– ఒక పన్ను నినాదంతో జీఎస్టి తగ్గింపు సంస్కరణలు
– జీఎస్టి తగ్గింపు అవగాహన సమావేశంలో ఆర్డీవో అఖిల, కూటమి పార్టీ నాయకులు వాసంశెట్టి సత్యం

**రామచంద్రపురం,మేజర్‌న్యూస్** : నూతన జీఎస్టీ విధానంతో భవన నిర్మాణ రంగ వినియోగదారులకు, అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా ఎన్డీఏ ప్రభుత్వం సూపర్ గిఫ్ట్ ఇచ్చిందని రామచంద్రపురం ఆర్డీవో దేవరకొండ అఖిల, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, కమర్షియల్ టాక్స్ జేసీ రవికాంత్ లు పాల్గొని మాట్లాడారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎన్.వి.ఆర్. ఫంక్షన్ హాల్‌లో జీఎస్టీ తగ్గింపు అవగాహన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో అఖిల మాట్లాడుతూ జీఎస్టి నూతన విధానాన్ని, ప్రభుత్వ ఉద్దేశాన్ని సభలో వివరించారు. ఒక దేశం ఒక పన్ను నినాదంతో ఎన్డీఏ ప్రభుత్వం జీఎస్టి తగ్గింపు సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. ముఖ్యంగా భవన నిర్మాణ రంగంలో ఉన్నవారికి జీఎస్టి తగ్గింపు స్వాంతన కలిగిస్తుందన్నారు. 1000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకుంటే సుమారుగా రూ. 1.5 లక్షలు ఆదా అవుతుందన్నారు. గతంలో 4 స్లాబులుగా ఉన్న జీఎస్టీ ను 2 స్లాబ్ లుగా సంస్కరించి అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా తీసుకొచ్చారన్నారు. కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ సూపర్ జీఎస్టి–సూపర్ సేవింగ్స్ పట్ల అన్ని వర్గాల ప్రజలకు, వ్యాపారస్తులకు అవగాహన కల్పించే నిమిత్తం ప్రభుత్వం అవగాహన సదస్సులు, ఇంటింట ప్రచారం, ర్యాలీలు నిర్వహిస్తుందన్నారు .అంతిమంగా జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రజలకు కలిగే లాభాలను, చేకూరే ప్రయోజనాలను తెలియజేయడమే లక్ష్యం అన్నారు. జీఎస్టీ సంస్కరణలు దేశ చరిత్రలో ఒక నూతన అధ్యయమని పేర్కొన్నారు. విద్యా, వైద్యం కు సంబంధించిన వస్తువులపై పూర్తి రాయితీ ఇచ్చిందన్నారు.కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్ సిహెచ్ రవి కాంత్ మాట్లాడుతూ భవన నిర్మాణ రంగం, వ్యవసాయ యంత్రాలు, ఆక్వా కల్చర్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, సామాన్య మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే ప్రతి వస్తువుపై జీఎస్టీ తగ్గించి నూతన జీఎస్టి 2.0 అమలు చేయడం జరుగుతుందన్నారు. జీఎస్టి స్లాబ్ నూతన విధానంతో వ్యాపారాలకు, అమ్మకాలు పెరుగుదల, నిర్మాణ ఖర్చులు తగ్గుదల జరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్టేట్ జీఎస్టి అసిస్టెంట్ కమిషనర్ పి.సత్యనారాయణ, మున్సిపల్ డిఈ శ్రీకాంత్, ఛాంబర్ ఆఫ్ కామర్స్‌అధ్యక్షులు కొవ్వూరి తాతారెడ్డి, సెక్రటరీసత్తిబాబు, ఎస్.కె.పి.పి.ట్రస్ట్ చైర్మన్ సలాదినాయుడు మాస్టర్, టిడిపి పట్టణ అధ్యక్షులు ఉండవిల్లి శివ, కూటమి పార్టీ నాయకులు చందమామ వాసు, కడియాల రాఘవన్,కవల.నానాజీ, మేడిశెట్టి శేషారావు, మేడిశెట్టి సూర్యనారాయణ, నారపురెడ్డి బలరాం,తాడిశ్రీనివాస్, జాస్తి విజయలక్ష్మి, వయిట్ల గజలక్ష్మి, బళ్ళ లక్ష్మి, భవన నిర్మాణ ప్రతినిధులు, చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపార ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాల అభివృద్ధికి కృషి



**కాకినాడ, మేజర్ న్యూస్** : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ నగరంలో నిర్వహిస్తున్న గ్రంథాలయాల అభివృద్ధికి, పాఠకులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని కాకినాడ నగర ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) అన్నారు.గ్రంథాలయ అభివృద్ధి కమిటీలు ఏర్పాటు నిమిత్తం కాకినాడ నగరంలోని గ్రంథాలయాల లైబ్రేరియన్లు ది.14.10.2025 మంగళవారం నాడు కాకినాడ నగర శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు)ని కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన కాకినాడ నగరంలోని అన్ని గ్రంథాలయాల అభివృద్ధికి, పాఠకులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడానికి, మరియు మూతబడిన గ్రంథాలయాలు తెరిపించడానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా కేంద్ర గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ (ఇంచార్జ్) కె. కిషోర్, గాంధీనగర్ శాఖా గ్రంథాలయ లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు, జగన్నాధపురం శాఖ గ్రంథాలయ లైబ్రేరియన్ అంబటి వెంకటనారాయణ, రామకృష్ణారావుపేట శాఖ గ్రంథాలయ లైబ్రేరియన్ కాటం రమేష్ బాబు పాల్గొన్నారు.

# యువత చెడు వ్యాసనాలకు బానిస కావద్దు



– ఎటపాక సీఐ యం కన్నప్ప రాజు

**ఎటపాక, మేజర్ న్యూస్** : యువత చెడు వ్యాసనాలకు బానిస కావద్దు అని ఎటపాక సర్కిల్ ఇన్స్పెక్టర్ యం.కన్నప్ప రాజు అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండల కేంద్రంలో గల యూత్ ట్రైనింగ్ సెంటర్ నందు ఎటపాక సీఐ యం కన్నప్ప రాజు వారి సిబ్బందితో కలిసి, గంజాయి లాంటి మత్తు పదార్ధాలపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా కన్నప్ప రాజు మాట్లాడుతూ యువత గంజాయి పట్ల అప్రమత్తంగా ఉంటూ, తల్లిదండ్రులకు మంచి పేరు, గౌరవం, సమాజం పట్ల బాధ్యతగా ఉండాలని, గంజాయికి బానిస కావద్దని, దాని వలన కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, గంజాయి మత్తులో పడి ఏమి చేస్తున్నామో తెలియని స్థితిలో యువత ఉండకూడదని, అటువంటి గంజాయి రవాణాపై ఎటువంటి సమాచారం ఉన్న దగ్గర్లో ఉన్న పోలీసు వారికి సమాచారం అందించగలరని, అదేవిధంగా యువత అంతా వృత్తి ట్రైనింగ్‌లో మంచి తర్ఫీదు పొంది, భవిష్యత్ పునాదికి పూలబాట వేసుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించడం జరిగింది.

# అక్రమ మైనింగ్ ఆపాలి



– బాధ్యులపై చర్యలు చేపట్టాలి– బీజేపీ డిమాండ్

**కాకినాడ, మేజర్ న్యూస్** : కాకినాడ జిల్లాలోని పెద్దాపురం డివిజన్ రామేశంపేట, ఆనూరు, కొండపల్లి గ్రామాల్లో అక్రమ మైనింగ్ (గనుల తవ్వకం) అరికట్టాలని అలాగే ఈ అక్కడ అక్రమ మైనింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం కాకినాడలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో అక్రమ మైనింగ్ ఆపాలని సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో విలేకరులతో సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా బిక్కిన మాట్లాడుతూ 1976లో అప్పటి ప్రధాని దివంగత ఇందిరాగాంధీ హయాంలో సుమారు 900 ఎకరాల భూమిని దళితులకు ఇచ్చారన్నారు. ఆ తర్వాత 1983లో ఎన్టీఆర్, తర్వాత వచ్చిన వైయస్ రాజశేఖర్ రెడ్డిలు అక్కడ తగు సదుపాయాలు కల్పించారని చెప్పారు.

వారిని ప్రలోభాలకు గురిచేసి అక్రమంగా భూములు తీసుకొని మాఫియా మైనింగ్ చేస్తుందన్నారు. దీనిని ఆపాలని కోరుతూ తాము డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. 2024లో అనుమతి నిచ్చిన దానికంటే అదనంగా మైనింగ్ చేశారని కలెక్టర్ నాలుగు కోట్ల రూపాయలకు పైగా వారికి అపరాధ రుసుమును విధించినట్లు ఆయన చెప్పారు. ఇప్పటివరకు 600 ఎకరాలకు పైగా మైనింగ్ చేశారని కానీ వాస్తవానికి 216 ఎకరాలకు మాత్రమే గనుల శాఖ నుంచి అనుమతి ఉందన్నారు. దాన్ని ఉల్లంఘించినా ఏమి పట్టనట్టుగా వ్యవహరించడంతో తాము మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్కి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కొద్దిరోజులు తాత్కాలికంగా నిలుపుదల చేసినా తర్వాత మళ్లీ వీరు కార్యకలాపాలను నిర్వహిస్తున్నారన్నారు.

దీనిపై తక్షణ చర్యలు చేపట్టి మైనింగ్ మాఫియాకు అడ్డుకట్ట వేయాలని బిక్కిన కోరారు.

కాకినాడ జిల్లాలో ఎక్కడైనా అక్రమంగా మైనింగ్ చేస్తే అడ్డుకుంటామని బిక్కిన స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు కుండల సాయికుమార్, చోడిశెట్టి రమేష్, దాట్ల కృష్ణ వర్మ, జ్యోతుల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఈజెడ్ భూములు బదిలీ ప్రక్రియలో స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు పూర్తిగా మినహాయింపు

– జిల్లా కలెక్టర్ షణ్మోహన్



కాకినాడ,మేజర్‌న్యూస్ : కాకినాడ ఎస్ఈజెడ్ భూములు రైతుల పేరును బదిలీ ప్రక్రియకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖ.. స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు పూర్తిగా మినహాయింపు ఇచ్చిందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాకినాడ కేఎస్ఈజెడ్ రైతులకు అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమైన నిర్ణయం తీసుకుందన్నారు. ఇందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన తెలిపారు.కాకినాడ ఎస్ఈజెడ్ లిమిటెడ్ ద్వారా రైతులకు బదిలీ చేయాల్సిన 2,180 ఎకరాల భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలపై స్టాంపు డ్యూటీ మరియు రిజిస్ట్రేషన్ ఫీజులు పూర్తిగా మినహాయించబడ్డాయని ఆయన తెలిపారు. ఈ మినహాయింపు 1899 స్టాంపు చట్టం సెక్షన్ 9(1)(ఎ) మరియు 1908 రిజిస్ట్రేషన్ చట్టం సెక్షన్ 78 ప్రకారం అమలు చేయబడుతుందని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంగా తెలిపిందన్నారు. ఈ మినహాయింపు కేవలం రైతుల పక్షాన జరిగే భూమి బదిలీలకు మాత్రమే వర్తిస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. డెవలపర్లు, యూనిట్లు లేదా స్పెషల్ ఎకనామిక్ జోన్ (ఎస్ఈజెడ్) అభివృద్ధి కార్యక్రమాల కోసం జరిగే లావాదేవీలకు మాత్రం ఈ మినహాయింపు వర్తించదని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రైతులకు ఆర్థిక భారం తగ్గించడంతో పాటు ప్రభుత్వంపై నమ్మకం పెంచే సానుకూల చర్యగా నిలుస్తుందని, రైతులు తమ భూముల బదిలీ ప్రక్రియలో ఈ మినహాయింపు నిబంధనలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కోరారు.

# 'పోలవరం' నిర్వాసితులకు భూమిని గుర్తించాలి



### – జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులకు వ్యవసాయానికి అణువుగా ఉన్న భూమిని గుర్తించి నివేదికలు సమర్పించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాల్లో పోలవరం ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, తహసిల్దార్లు, ఆర్ అండ్ ఆర్ అధికారులు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుతో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్ ఆర్ అండ్ఆర్ ప్యాకేజీ ద్వారా భూములు గుర్తింపుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ ముంపునకు గురైన చింతూరు డివిజన్, రంపచోడవరం డివిజన్ పరిధిలోని బాధితులకు వ్యవసాయానికి అణువుగా ఉన్న భూమిని గుర్తించి ప్రభుత్వ భూమి, ప్రైవేట్ భూమికి సంబంధించిన నివేదికలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. గంగవరం, రాజవొమ్మంగి, అడ్డతీగల ఒక్కొక్క మండలంలో ఎన్ని ఎకరాలు గుర్తించింది ఆయన ఆరా తీశారు. ఎంతమంది ముంపునకు గురైన గిరిజనులకు ల్యాండ్ టు ల్యాండ్ ఎన్ని ఎకరాలు అవసరమవుతున్నది ఆయన ఆరా తీశారు. భూములు కొనుగోలు చేసే గ్రామాలలో ఎన్ని గ్రామాలలో గ్రామసభలు ద్వారా యాక్షన్ ప్లాన్ తయారు చేసింది ఆయన ఆరా తీశారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ద్వారా గిరిజనేతరులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ద్వారా ఎక్కడెక్కడ స్థలములు గుర్తించినది అదేవిధంగా ప్రారంభించిన ఆర్ అండర్ ప్యాకేజీ గృహాలు ఏ విధంగా కట్టుచున్నది ఆయన ఆరా తీశారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కొరకు ల్యాండ్ టు ల్యాండ్ ఏర్పాటు కొరకు గుర్తించిన భూములకు మ్యాపింగ్ చేయాలని ఆయన అన్నారు.

ప్రాజెక్టు ముంపు బాధితులకు నచ్చిన భూములు ఎంపిక చేయాలని ఆయన అన్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ద్వారా గృహాలు నిర్మించే విధంగా టెండర్లు ప్రక్రియ ఏ విధంగా నిర్వహించింది ఆయన ఆరా తీశారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి పనులకు పెండింగ్ పనులు ఉన్న వాటిని వేగవంతముగా పనులు పూర్తి చేయాలని ఆయన అన్నారు. ఆర్ అండ్ ఆర్ కాలనీల వాసులకు స్మశాన వాటిక లేని వాటిని భూములు కొనుగోలు చేసి ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పి.అంబేద్కర్, కే.నాసరయ్య, ఆంజనేయులు, జి.బాలకృష్ణ, కే.సతీష్, చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు, తహసిల్దారులు ఏ.సత్యనారాయణ, కరక సత్యనారాయణ, సిహెచ్.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, ఎస్.బి.వి. రెడ్డి, రవికుమార్, మురళీ, ఆర్అండ్ఆర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### భవిత కేంద్రంను పరిశీలించిన ఎంఈఓ వి.ఆర్.కె.చౌదరి



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ ప్రైమరీ స్కూల్లో సమగ్ర శిక్షా ద్వారా నడపబడుతున్న భవిత కేంద్రం నందు మంగళవారం పెద్దాపురం మండల విద్యాశాఖాధికారి-2 వి.ఆర్.కె.చౌదరి ఫిజియోథెరపి పరిశీలించారు. దీనిలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఫిజియోథెరపి కేంద్రంలో ప్రతీ మంగళవారం ఉదయం నుండి సాయంత్రం వరకు నిర్వహించబడుతుందని భవిత పిల్లల తల్లితండ్రులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఓ తెలిపారు. మండలంలోని శారీరక వైకల్యం, మెదడు పక్షవాతం గల దివ్యాంగ పిల్లలకు ఈ భవిత కేంద్రంలో ప్రతీ మంగళవారం జరిగే ఫిజియోథెరపి సేవలను ఉచితంగా అందజేయడం జరుగుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం సహిత ఉపాధ్యాయులు బి.దుర్గాప్రసాద్‌రెడ్డి, బి.ఆనందరావు, ఫిజియోథెరపిస్ట్ వి.అపర్ణ, భవిత విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త గురువులకు స్వాగతం

### – మండలంలో పదిమంది నూతన ఉపాధ్యాయులు చేరిక




**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలంలో నూతన డిఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు పదిమంది విధులలో చేరారని, మండల విద్యాశాఖాధికారి-2 వి.ఆర్.కె.చౌదరి తెలిపారు. దీనిలో భాగంగా ఎస్‌జిటిలు నలుగురు, స్కూల్ అసిస్టెంట్లు ఆరుగురు విధులలో చేరారని, ఎంఇఓ తెలిపారు. పెద్దాపురం పట్టణంలోని ఎన్‌టిఆర్ కాలనీలో గల హైస్కూల్ నందు నూతనంగా విధులలో చేరిన ఉపాధ్యాయులు బేతా రాజుబాబుకు స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం.మాధవ్ ఆధ్వర్యంలో విద్యార్థులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఐ.శారద, కె.జగదీశ్వరరావు, ప్రవల్లిక, సూర్యకాంతం, సరస్వతి, రాజేష్‌బాబు, మధుకుమార్, నరేష్, యశోద పద్మ,శివ,సిబ్బంది భారతి, మాధవి, విద్యార్థులు, స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

# స్విమ్మింగ్‌లో సత్తా చాటిన ప్రొఫెసర్ కుమార్ రెడ్డి



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** ఆదిత్య యూనివర్సిటీ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న "ఎం.వి. కుమార్ రెడ్డి", ఆదివారం మంగళగిరి శంషేర్ ఖాన్ స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన 7వనేషనల్ మాస్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ 2025లో సత్తా చాటి మూడు పతకాలు గెలుచుకున్నారని ప్రో ఛాన్సలర్ డా.ఎన్. సతీష్‌రెడ్డి తెలిపారు. స్విమ్మింగ్‌లో బ్రెస్ట్ స్ట్రోక్ విభాగంలో బంగారు పతకం (25మీ) బట్టర్‌ఫ్లైలో కాంస్య పతకం (25మీ)ఫ్రీ స్టైల్‌లో రజతం పతకం (25మీ) గెలుచుకున్నారనీ వివరించారు. ఈ సందర్భంగా విజేత ఎం వి కుమార్ రెడ్డి ను ప్రో ఛాన్సలర్ డా.ఎన్. సతీష్ రెడ్డి, డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి, ప్రో వైస్-ఛాన్సలర్ డా. ఏ. రమేష్, డీన్ వై.కె.ఎస్. సుబ్బారావు, విభాగాధిపతి డా. మానం రవీంద్ర, తదితరులు అభినందనలు తెలిపారు. భవిష్యత్ లో మరిన్ని పథకాలు అందుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు.

### సిఐటియు జిల్లా మహాసభల కరపత్రం ఆవిష్కరణ




**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** అక్టోబర్ 25, 26 తేదిలలో పెద్దాపురం పట్టణంలో జరిగే సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ సిఐటియు జిల్లా 12వ మహాసభల కరపత్రం ఆవిష్కరణ మంగళవారం యాసలపు సూర్యారావు భవనంలో జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల మీద సిఐటియు పనిచేస్తుందని, కార్మికుల కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ సమస్యల మీద నిరంతరం పోరాడుతుందన్నారు. అంగన్‌వాడీ, ఆశా, మిడ్డే మీల్ వర్కర్లను సమీకరించి, ఐక్యంగా నిలిపిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికులను సమీకరించడంలో సిఐటియు కృషి అమోఘమన్నారు. అక్టోబర్ 25, 26 తేదిలలో పెద్దాపురంలో జరిగే మహాసభలు విజయవంతం చేయాలని, కార్మిక వర్గానికి, ప్రజానికానికిఆయనవిజ్ఞప్తిచేశారు.ఈకార్యక్రమంలో యూనియన్ నాయకులు వడ్డి సత్యనారాయణ, గునూరు రమణ, తైనాల శ్రీను, పద్మ, తాడిశెట్టి గంగ, సిఐటియు నాయకులు సిరపురపు శ్రీనివాస్, జి.పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

# వరదల వల్ల ఇళ్లకు, పంటలకు నష్టపరిహారం ఇంకెప్పుడు..?



**కూనవరం, మేజర్ న్యూస్ :** అల్లూరిసీతారామరాజు జిల్లా కూనవరం మండలం లోని సిపిఎం పార్టీ ఆవుల నాగమయ్య భవనంలో సమావేశంలో జిల్లా కమిటీ సభ్యురాలు సర్పంచ్ మడకం నాగమణి మాట్లాడుతూ మండలంలోని ఈ సంవత్సరం అధిక వర్షాలతో వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన నేటి పోలవరం బ్యాక్ వాటర్ కారణంగా మండల వ్యాప్త ప్రజానికం వ్యవసాయ పనులు లేక ఇతర ఏ విధమైన ఉపాధి లేక ఆర్థికంగా మానసికంగా తీవ్ర శోభకు గురి అవుతున్న ప్రభుత్వం ప్రకటించిన వరదల నష్టపరిహారం ఐదు నెలలు గడుస్తున్నా వ్యక్తిగత ఖాతాలకు సహాయం చేయకపోగా రేపు మాపు అంటూ ప్రజలను మభ్యపెడుతూ కాలయాపన చేయటం తగునా..అదేవిధంగా ఇప్పటికే రెండు రెండేసి సార్లు వరి వేసి మునిగి నష్టపోయిన రైతులను పూర్తిస్థాయి లో సకాలంలో సర్వే చేయకపోవడం నష్టపోయిన పంటలకు నిర్దిష్టమైన నష్టపరిహారం ఇప్పటిదాకా ప్రకటించకపోవడం నిర్వాసిత మండల రైతులను ప్రజల పై సవితి తల్లి ప్రేమను చూపటం ఇకనైనా మానండి. విజయవాడలో బుడమేరా వాగు పొంగి వరదలు ముంచేస్తే రాష్ట్ర ప్రభుత్వం స్పందించిన తీరు అభినందనీయం కానీ ఈ మండలాలలోని ప్రజానీకాన్ని కనీసం ఆదుకోవాలని ఆలోచన ప్రభుత్వానికి ఉందా లేదా..ఇప్పటికైనా వెంటనే ప్రభుత్వం ప్రకటించిన వరద సహాయాన్ని వెంటనే అందించాలని లేనిపక్షంలో ముంపు మండల ప్రజలను ఏకం చేసి ఉద్యమాలు చేస్తామని సిపిఎం పార్టీగా డిమాండ్ చేస్తున్నాం ఈ సమావేశంలో పాల్గొన్న మేకల నాగేశ్వరరావు పాయం సీతారామయ్య మండల కార్యదర్శి బాబు బొరయ్య మండల కమిటీ సభ్యులు తాలూరి శ్రీనివాస్ తెల్లం తమ్మయ్య పట్టణ శాఖ కార్యదర్శి కొండ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న 1600 కేజీల పిడిఎస్ బియ్యం పట్టివేత



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలోని లాగరాయి గ్రామంలో అక్రమంగా పిడిఎస్ బియ్యం తరలిస్తున్న వ్యాన్ పట్టుకొని 1600 కేజీల బియ్యం సీజ్ చేసినట్లు తాసిల్దార్ అల్లు సత్యనారాయణ తెలిపారు. వారికి వచ్చిన సమాచారం మేరకు మంగళవారం ఉదయం పిడి ఎస్ బియ్యం తరలిస్తున్న వాహనంపై దాడి చేసి పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు పెద్దాపురం మండలానికి చెందిన కోరుకొండ అచ్చిరాజుపై కేసు నమోదు చేశామన్నారు. బియ్యాన్ని జడ్డంగిఎం ఎల్ ఎస్ గోడౌన్కు తరలించి వ్యాన్ స్థానిక పోలీస్ స్టేషనుకు అప్పగించినట్లు తాసిల్దార్ తెలిపారు. ఈ దాడిలో తాసిల్దార్ సత్యనారాయణ తో పాటు వీఆర్వో మురళి, నాగేశ్వరరావు ఉన్నారు.

# బాలికలు అన్ని రంగాలలో అవకాశాలు అందిపుచ్చుకొని అభివృద్ధి పథంలో నడవాలి




–అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బాలికలకు శుభాకాంక్షలు తెలిపిన జిల్లా అధికారులు

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్** : అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో మంగళవారం మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పి.డి. స్త్రీ సంక్షేమ శాఖ అధికారి టి. శ్రీదేవి అధ్యక్షత వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి టి. శ్రీదేవి మాట్లాడుతూ , బాలికలు అన్ని రంగాల్లోనూ సమాన అవకాశాలు పొందుతూ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నారని తెలిపారు. విద్య అనే ఆయుధంతో ప్రతిబాలికఉన్నత శిఖరాలను అధిరోహించాలని, సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలవాలని సూచించారు. ప్రతి ఒక్కరు పుస్తక పరిజ్ఞానం సాధించి జీవితంలో ముందుకు సాగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.జిల్లా విద్యా శాఖాధికారి కే.వాసుదేవరావు మాట్లాడుతూ బాలికలు విద్యలో రాణించడమే కాకుండాఆత్మవిశ్వాసంతో ప్రతి రంగంలో ముందుకు సాగాలని సూచించారు.కుటుంబ అభివృద్ధికి మహిళల పాత్రకీలకమని, మహిళలకు అవకాశాలుకల్పిస్తే సమాజంలోని అన్ని రంగాలలో విజయాలు సాధ్యమవుతాయని అన్నారు. మహిళలు, బాలికలు స్వీయ రక్షణ నైపుణ్యాలు అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ కె.ఎన్. జ్యోతి మాట్లాడుతూ బాలికలు భద్రత, రక్షణ, ఆరోగ్యం, పౌష్టికాహారం మీద అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

ప్రతిమహిళ తన ఆత్మస్థైర్యం పెంపొందించుకుని జీవిత సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని అన్నారు. విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాలు సాధనద్వారా సమాజంలో స్థిరమైన స్థానం పొందాలని సూచించారు. సైబర్ క్రైమ్ సెల్ అధికారి వై.ఎస్.వి. సురేష్‌బాబు మాట్లాడుతూ స్మార్ట్‌ఫోన్ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని, సోషల్ మీడియాలో నిర్లక్ష్యం వల్ల సైబర్ క్రైమ్ ఘటనలు పెరుగుతున్నాయని హెచ్చరించారు. అనుమానాస్పద ాూఖ ఫైళ్ళను ఓపెన్ చేయకూడదని, వ్యక్తిగత వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని సూచించారు. ప్రభుత్వం అందుబాటులో ఉంచిన హెల్ప్‌లైన్ నంబర్లను తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ బి. శశాంక మాట్లాడుతూ ఆధునిక సమాజంలో ఆడపిల్లలు శారీరక, మానసిక దృఢత్వం అలవర్చుకోవడం అత్యంత అవసరమని తెలిపారు. విద్యతోపాటు ఆత్మరక్షణలో నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీఐఓ డా పి. కోమల, డిపిఎమ్ఓ కే. శ్రీవల్లి, బాలికల చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డి.ఎస్తేరు రాణి, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ముత్యాల సుబ్బారావు, సిడిపీవోలు, బాలికలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యను బోధించాలి





– ఏకలవ్య పాఠశాలలో జిల్లా కలెక్టర్

**రంపచోడవరం, మేజర్ న్యూస్** : ఏజెన్సీలో ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఒకటికి రెండుసార్లు ఉపాధ్యాయులు విద్యను బోధించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి అడ్డతీగల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను అదేవిధంగా వీరవరం గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్ ఆకస్మికంగా పరిశీలిం చారు. ముందుగా అడ్డతీగల మండలంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్సి పాఠశాలను, అదేవిధంగా వీరవరం గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశా లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ పాఠశాలలో ఎంతమంది ఉపా ధ్యాయులు ఉన్నది, ఎంతమంది విద్యార్థులు ఉన్నది ఆయన ఆరా తీశా రు. విద్యారు ్థలకు అర్థమయ్యే రీతిలో ఒకటికి రెండుసార్లు విద్యను బోధించాలని ఆయన అన్నారు. విద్యార్థులకు విద్యతోపాటు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం ప్రతిరోజు మెనూ పక్కగా అమలు చేయాలని ఆయన అన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు అర్థమవుచున్నది లేనిది విద్యార్థులను కలెక్టర్ ఆరా తీశారు. ఉపాధ్యాయులు చెప్పినపాఠాలు విద్యార్థులకు అర్థంకాని ఎడల తిరిగి చెప్పమని ఉపాధ్యాయులకు చెప్పాలని ఆయన అన్నారు. విద్యార్థులందరికీ పుస్తకాలు అందినవి లేనిది కలెక్టర్ ఆరా తీశారు.

# కోడి పందాల పర్యటనలో హత్యకు దారి తీసిన సంఘటనలో ముద్దాయి అరెస్ట్



ఏలేశ్వరం, మేజర్ న్యూస్ : కోడిపందాల నేపథ్యంలో జరిగిన హత్యకు సంబంధించి ముద్దాయిని మంగళవారం అదుపులో తీసుకున్నట్లు పెద్దాపురం డిఎస్పి శ్రీహరి రాజు వెల్లడించారు. ఈ సంఘటనకు సంబంధించి ఆయన అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలేశ్వరం పట్టణానికి చెందిన వల్లూరి రాజా రమేష్ అనే యువకుడు కోళ్లను పెంచి కోడి పందాలు ఆడే అలవాటు ఉంది. ఈ నేపథ్యంలో బొద్దిరెడ్డి వెంకటేశ్వ ర్లకు కోడిపందాలు ఆడే అలవాటు ఉండటంతో (రాజా రమేష్ వెంకటేశ్వర్లు) వీరిద్దరి మధ్య కోడిపందాల ఆటలలో పరిచయం ఏర్పడింది. దీంతో రాజా రమేష్ వెంకటేశ్వర్లు వద్ద దప దపాలుగా పది లక్షల రూపాయలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తిరిగి చెల్లించకపోవడంతో వెంకటేశ్వర్లు పలు మార్లు అప్పు తిరిగి చెల్లించమని ఒత్తిడి తేసాగాడు.కాగా వెంకటేశ్వర్లను హతమార్చేందుకు రాజా రమేష్ కుట్రపన్నాడు. అయితే ఈనెల మూడవ తేదీన గిరిజన ప్రాంతమైన నర్సీపట్నం మండలంలో కోడిపందాలు ఉన్నాయని ముద్దాయి రాజా రమేష్ వెంకటేశ్వర్లను నమ్మించి కారులో తీసుకుని వెళ్ళాడు. ముందుగా పథకం ప్రకారం అతడికి కూల్ డ్రింక్ లో మత్తుమందు కలిపి ఇచ్చాడు. వెంకటేశ్వర్లు స్పృహ కోల్పోవడంతో అతడిని ఎవరు లేని బోదరాళ్ల ఘాటి వద్ద హత్య చేసి సాక్ష్యాలను చెరిపే ప్రయత్నం చేశాడు. మృతుడి వద్ద ఉన్న నగదును బంగారాన్ని దోచుకెళ్లినట్లు ముద్దాయి రాజా రమేష్ వివరించినట్లు పెద్దాపురం డి.ఎస్.పి శ్రీహరి రాజు తెలిపారు. అయితే నిజం ఎక్కడ బయట పడుతుందో అని రాజా రమేష్ పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడితే రాజా రమేష్ తన సోదరుడు ఆస్పత్రిలో చేర్పించారు. ఈ నెల 13వ తేదీ సోమవారం ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ అవ్వగా అతడిని ప్రత్తిపాడు సిఐ అప్పారావు అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు డిఎస్పి మీడియాతో తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ యువత సేడు వ్యసనాల బారిన పడితే జైలు పాలు అవుతారని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను గమనించాల్సిన అవసరం ఉందన్నారు.

# ఘనంగా అనఘా అష్టమి వ్రతం



**అనపర్తి,మేజర్‌న్యూస్** : మండలంలోని, అనపర్తి గ్రామంలో ఆర్కే ఎగ్ గోడౌన్ సమీపంలోని ఔదంబర దత్తపీఠంలో అనఘా అష్టమి వ్రతం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అట్లే మండలంలోని, మహేంద్రవాడ గ్రామంలో శివాలయ ప్రాంగణంలో నిర్వహించిన అనఘాష్టమి వ్రతమునకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, వేద పండితులు నిర్వహించిన కృత కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిం చారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేదమంత్రాల మధ్య భక్తుల శ్రీకృష్ణ నామస్మరణతో వాతావరణం ఆధ్యాత్మికంగా మారింది. పూజ అనంతరం భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించబడింది.

# రెడ్ క్రాస్ జాతీయ కార్యవర్గ సభ్యునిగా ఎన్నికైన వై.డి. రామారావు



కాకినాడ,మేజర్‌న్యూస్ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాఖ చైర్మన్ వై.డి. రామారావు రెడ్ క్రాస్ జాతీయ కార్యవర్గానికి జరిగిన ఎన్నికల్లో దక్షిణ భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తు ఎన్నికయ్యారు. భారత ప్రభుత్వ ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జె.పి.నడ్డా అధ్యక్షతన ఈజాతీయ మేనేజింగ్ కమిటీ పనిచేస్తుంది. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ లోని 28 రాష్ట్ర మరియు కేంద్రపాలిత ప్రాంతాల శాఖల నుండి రెండు సంవత్సరాల పదవీకాలానికి పన్నెండు రాష్ట్రాల సభ్యులు ఎన్నికయ్యారు. కాకినాడ జిల్లా శాఖ ఛైర్మన్‌గా, ఆయన అనేక మానవతా మరియు సమాజ సేవా ప్రాజెక్టులకు నాయకత్వం వహించారు. ఈ ప్రాంతంలో రెడ్ క్రాస్ ఉద్యమాన్ని గణనీయంగా బలోపేతం చేశారు.రెడ్ క్రాస్‌కు ఆయన చేసిన అత్యుత్తమ కృషికి గుర్తింపుగా, ఆయనకు 2018–19 సంవత్సరానికి రాష్ట్రపతి బంగారు పతకాన్ని ప్రదానం చేశారు. జాతీయ మేనేజింగ్ బాడీలోకి ఆయన చేరిక దక్షిణ భారతదేశం అంతటా,ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో రెడ్‌క్రాస్ సేవాప్రాజెక్టుల పరిధి మరియు ప్రభావాన్ని మరింత పెంచుతుంది.

# సివిల్ విభాగంలో ముగిసిన వర్క్‌షాప్




గండేపల్లి,మేజర్‌న్యూస్ : సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రెండు వారాలపాటు నిర్వహించిన "స్ట్రక్చరల్ డిజైనింగ్ యూజింగ్ ఎటాబ్స్" మరియు "బిల్డింగ్ డ్రాఫ్టింగ్ యూజింగ్ ఆటో క్యాడ్ " అనే రెండు వర్క్‌షాపులు విజయవంతంగా ముగిశాయి. ఈకార్యక్రమాలు ఇండస్ట్రీ–ఓరియెంటెడ్ ట్రైనింగ్‌లో భాగంగా రూపొందించబడ్డాయి. విద్యార్థులు భవన నిర్మాణ రూపకల్పన మరియు డ్రాఫ్టింగ్ విషయాలలో ఆధునిక సాఫ్ట్‌వేర్‌ల వినియోగాన్ని నేర్చుకున్నారు. ప్రిన్సిపాల్ డా. ఆదిరెడ్డి రమేష్ మాట్లాడుతూ, "సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఆధారిత డిజైనింగ్ టూల్స్‌లో నైపుణ్యం పెంపొందించుకోవడం భవిష్యత్తు కెరీర్ అభివృద్ధికి కీలకం" అని తెలిపారు. డీన్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ వైకేఎస్ సుబ్బారావు మాట్లాడుతూ, "ఇటువంటి వర్క్‌షాపులు విద్యార్థులలో సాంకేతిక ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి మరియు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా వారిని సిద్ధం చేస్తాయి" అని పేర్కొన్నారు. విభాగాధిపతి నాగ సాయి విద్యార్థుల ప్రాక్టికల్ అవగాహనను అభినందిస్తూ, సర్టిఫికెట్లను అందజేశారు.

# ఉత్తమ అధ్యాపకుడిగా డాక్టర్ యర్రంశెట్టికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు



**అమలాపురం, మేజర్ న్యూస్ :** ఉన్నత విద్యా విభాగంలో ఉత్తమ అధ్యాపకు డిగా మలికిపురం మండలం కేశనపల్లి గ్రామానికి చెందిన ఎలక్ట్రానిక్స్, ఫిజిక్స్ అధ్యాపకుడు డాక్టర్ విజయ్ సత్య ప్రసాద్ యర్రంశెట్టి అంతర్జాతీయ గుర్తింపు పొందారు. ఈ మేరకు ఆయన ఇటీవల విజయవాడలో జరిగిన అంతర్జాతీయ సొసైటీ ఫర్ లెర్నింగ్ టెక్నాలజీస్ సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అంతర్జాతీయ ఉత్తమ అధ్యాపకుడు పేరుతో అవార్డును అందుకున్నారు. దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్రాలకు చెందిన ప్రముఖ యూనివర్సిటీలు, విద్యా సంస్థలు నుంచి 625, అమెరికా నుంచి 75 నామినేషన్లు రాగా అందులో 125 మందికి ఆయా రంగాల్లో అవార్డులు అందించగా.. ఉన్నత విద్యలో తాను అంతర్జాతీయ అవార్డు అందుకోవడం చాలా గర్వకారణంగా ఉందని డాక్టర్ యర్రంశెట్టి చెప్పారు. అలాగే ఈ అంతర్జాతీయ సంస్థలో ఆయనకు జీవితకాలపు సభ్యత్వాన్ని కూడా అందజేసినట్లు చెప్పారు. డిగ్రీ విద్యలో పరిశోధనలను మేళవించి బోధన చేయడం, విద్యార్థులను మార్గ దర్శనం చేయడం, అలాగే తమ జీవిత సాఫల్యతకు ఆయన మార్గం చూపిన తీరును విద్యార్థుల నుంచి అభిప్రాయ సేకరణ చేసి ఆయనకి ఈ అవార్డును అందజేసినట్లు ముఖ్య అతిథులు కొనియాడారు. కేంద్ర విద్యా శాఖ, ఏఐసీటీఈ, అనువాదిని ఏఐ చీఫ్ కోఆర్డినేటింగ్ అధికారి డాక్టర్ బుద్ధా చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్.విజయభాస్కరరావు, ఆంధ్రకేసరి విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు, ఇగ్నో ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ కె.సుమలత,అమెరికా అలాబామా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ జి.పి.నాగరాజు తదితర ప్రముఖులు ఆయనకి ఈ అవార్డుని అందజేశారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ నిత్యం బోధనతో పాటుగా పరిశోధనలు చేస్తూ ప్రసిద్ధ జాతీయ, అంతర్జాతీయ జర్నళ్లల్లో 22 పరిశోధనా వ్యాసాలను ప్రచురించడం ఆయన ప్రతిభని సూచిస్తుందన్నారు. అలాగే డిగ్రీ, ఇంటర్, ఇంజినీరింగ్ లాంటి కోర్సులతో పాటుగా ఐఐటీ లాంటి పోటీ పరీక్షలకు ఉపయోగ పడే ఎలక్ట్రికల్ అప్లయెన్సెస్, నానోమెటీరియల్స్, ఎలక్ట్రిసిటీ, మాగ్నెటిజం, ఎలక్ట్రానిక్స్, మోడరన్ ఫిజిక్స్, ఎలిమెంట్స్ ఆఫ్ మోడరన్ ఫిజిక్స్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, డిజిటల్ ఎలక్ట్రానిక్స్, వేవ్ ఆప్టిక్స్, క్వాంటం మెకానిక్స్, డిజిటల్ ప్రిన్సిపల్స్ వంటి సబ్జెక్టులకు ఆయన రచించిన అకడమిక్ పాఠ్యపుస్తకాలను విశ్లేషణ చేస్తే ఆయన మేధస్సు అవగతమవుతుందని కొనియాడారు.

## ‘మై భారత్’ కాకినాడ వారి ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

– శ్రీ సత్యదేవా జూనియర్ కళాశాల క్రీడ ప్రాంగణంలో నిర్వహణ

– మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ గ్రామీణ యువతకు ప్రోత్సహం



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ ప్రతి సంవత్సరము గ్రామీణ యువతను ప్రోత్సహించే ప్రయత్నంలో భాగంగా ఈ సంవత్సరం మై భారత కాకినాడ వారి ఆధ్వర్యంలో శ్రీ సత్యదేవా జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో విద్యార్థిని విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఘంటసాల వెంకట ప్రారంభించారు. బ్లాక్ లెవెల్లో జరిగిన ఈ పోటీలలో బాలురకు వాలీబాల్ రన్నింగ్ మరియు బాలికలకు కబడ్డీ రన్నింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో నెగ్గిన టీమ్లను స్టేట్ లెవెల్ పోటీలకు పంపడం జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు. అనంతరం జరిగిన సభలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలిచిన బాలబాలికలకు బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ యువత క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలని, దేహం ఆరోగ్యం ఉన్నప్పుడే మెదడు కూడా చురుగ్గా పనిచేసి విద్యార్థులు చదువుల్లో ప్రతిభకనబరుస్తారని తెలియజేశారు

. ఈ కార్యక్రమంలో కాకినాడ నుండి సెంట్రల్ బోర్డ్ మెంబర్ అయిన చిత్ర పాపారావు ముఖ్య భూమికను పోషించారు. ఈ కార్యక్రమంలో 100 మంది క్రీడాకారులు పాల్గొని వాళ్ళ ప్రతిభను కనబరిచారు. కొండబాబు, సత్యనారాయణ, అరుణ్ కుమారి పర్యవేక్షణలో క్రీడలను చక్కగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## రైతుల ఇంట ఆనందం

– ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

ఎస్సీ జెడ్ భూమి యజమానులకు శుభవార్త



**యు.కొత్తపల్లి, మేజర్ న్యూస్ :** కాకినాడ సెజ్ రైతులకు ఇచ్చిన 1100 ఎకరాలు తిరిగి ఇవ్వాలని ప్రభుత్వం అధికార ప్రకటనపై ఎస్సీజడ్ భూ యజమానులు హర్షం వ్యక్తం చేశారు. భూములను రైతులకు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని, రైతుల వద్ద రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీలు వసూలు చేయవద్దని రెవెన్యూశాఖ ఆదేశించింది.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ముమ్ముడువారిపాడు గ్రామంలో పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మర్రెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ మరియు సీనియర్ జనసేన నాయకులు జ్యోతుల శ్రీనివాస్, తేలగంశెట్టి వెంకటేశ్వంరావు, పిల్ల శివశంకర్, సీతయ్య కాపు, భూమి యజమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల వసతి గృహాల ఆకస్మిక తనిఖీ చేసిన ఆర్డీవో మల్లిబాబు



**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం పీ.వెంకటాపురంలోని డా. బీ.ఆర్.అంబేద్కర్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, కళాశాల వసతి గృహాన్ని మంగళవారం కాకినాడ ఆర్డీవో, కాకినాడ రూరల్ నియోజకవర్గం ప్రత్యేక అధికారి ఎస్.మల్లిబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సదుపాయాల తీరుతెన్నులను పరిశీలించారు. వసతి గృహం అధికారులు, పాఠశాల సిబ్బందితో మాట్లాడి వివరాలు ఆరాతీశారు.విద్యార్థినిలతో మాట్లాడి వసతి గృహంలోని సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విద్యార్థినిలతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కాకినాడ రూరల్ మండలం పీ.వెంకటాపురంలోని డా. బీఆర్.అంబేద్కర్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, కళాశాల వసతి గృహాన్ని సందర్శించి, విద్యార్థినులకు అందుతున్న సదుపాయాలను తనిఖీ చేయడం జరిగిందన్నారు. వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థినిలకు తప్పనిసరిగా ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం ప్రతిరోజు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. ప్రాముఖ్యంగా వసతి గృహం పరిసరాలు, మరుగుదొడ్లలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. వసతి గృహం భవనాలను పరిశీలించి అవసరమైన మరమ్మత్తులకు ప్రతిపాదనలు పంపించాలని ఆర్డీవో ఎస్.మల్లిబాబు వసతి గృహ అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలనలో ఆర్డీవో వెంట కాకినాడ రూరల్ మండలం ఎంపీడీవో సతీష్, తహసీల్దార్ ఎస్.ఎల్.ఎన్.కుమారి, ప్రిన్సిపాల్ సీహెచ్.మేరి గ్రేస్ పరిమళ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న జేసీ రాహుల్ మీనాకు ఘన వీడ్కోలు



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు కమిషనర్‌గా బదిలీపై వెళ్తున్న కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు ఘనంగా వీడ్కోలు పలికారు. మంగళవారం రాత్రి కాకినాడలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలోఉన్న పీజిఆర్ఎస్ భవనంలో ఆయనకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈకార్యక్రమానికిజిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్, అసిస్టెంట్ కలెక్టర్ మనీష, ఆర్డీవోలు ఎస్.మల్లిబాబు, ఎం.శ్రీరమణిలతో పాటు పలువురు జిల్లాఅధికారులు,కాకినాడ జిల్లాలో ఉన్నత హశీల్దార్లు అధికసంఖ్యలో హాజరయ్యారు

## ‘కూటమి’ ప్రభుత్వంపై విష ప్రచారం ఆపాలి




**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** మద్యం విషయంలో వైసిపి నేతలు విష ప్రచారం ఆపకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని తెలుగుదేశం రంపచోడవరం మండల పార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంత మోహన్ అన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మోహన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత మద్యం విధానం విషయంలో అత్యంత పారదర్శకంగా పనిచేస్తుంటే వైసీపీ పార్టీ నాయకులు కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడం తగదన్నారు. విషయ పరిజ్ఞానం లేకుండా చౌకబారు విమర్శలు చేస్తే తెలుగుదేశం పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. నాడు కల్తీ మద్యాన్ని వైసిపి నేతలు ప్రోత్సహిస్తే, కూటమి ప్రభుత్వం ఉక్కు పాదం మోపిందన్నారు. కల్తీ మద్యం బ్రాండ్లు మార్కెట్లోకి తెచ్చింది వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని, కల్తీ బ్రాండ్ మద్యం తాగి ఎంతోమంది ప్రాణాలు పోగొట్టుకుని వారి కుటుంబాలకు దూరమైన సంగతి అందరికీ తెలుసని పేర్కొన్నారు. కల్తీ మద్య విషయంలో కూటమి ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయడంతో ఎక్కడ వారి తప్పుడు పాలసీలు బయటపడతాయనే భయం వైసిపి నాయకులకు మొదలైందని మోహన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నూర్ భాషా కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సుభాన్, క్లస్టర్ ఇంచార్జ్ కారం సింహాచలం, ప్రధాన కార్యదర్శి కోసు నాగన్న దొర, సీతపల్లి బాపనమ్మ తల్లి గుడి చైర్మన్ కుంజం బాపన్న దొర, మాజీ సర్పంచ్ వై నిరంజనీ దేవి, ఎడ్లపల్లి పోసిబాబు, నీలాపు సూరిబాబు, ఆశు, మంతెన మంగ పాల్గొన్నారు.

## శ్రీ శృంగార వల్లభస్వామి నిత్యాన్నదానానికి లక్ష రూపాయలు విరాళం



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం, తొలితిరుపతి గ్రామంలో వేంచేసి యున్న శ్రీ శృంగార వల్లభ స్వామి దేవస్థానం అన్నదాన ట్రస్ట్‌కు విఖాఖపట్టణం వాస్తవ్యులు బుద్దేపు లక్ష్మీపార్వతి రూ.1 లక్ష రూపాయల విరాళం అందజేయడం జరిగి ందని, దేవస్థాన కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. దీనిలో భాగంగా వారికి స్వామివారి దర్శనం కల్పించి, వేదాశీర్వచనాలు, స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.